# పిల్లపేరు మల్లెమొగ్గ

కోలపల్లి ఈశ్వరరావు

"కాకి..కాకి..కడవళ్ళ కాకి..కాకి నోట్లో దీపం
వెళ్ళి దిబ్బలో పడింది -
దిబ్బేమిచ్చింది?
ఎరువు -
ఎరువేం చేశావు?
చేను కేశా -
చేనే మిచ్చింది ?
గడ్డి -
గడ్డేం చేశావ్?
ఆ వు కేశా -
ఆ వే మిచ్చింది ?
పాలు -
పా లేం చేశావ్?
మామ కిచ్చా -
మా మే మిచ్చాడు?
పిల్ల నిచ్చాడు -
పిల్ల పేరు మల్లెమొగ్గ...నీ పేరు జమిందార్"

కోటి కోకిలలు ఒక్కసారి కూసినట్లూ వేల సెలయేళ్ళు ఒక్కపెట్టున ఉరికి నట్టూ ఆమె నవ్వుతోంది కిల కిలా. ఆమె నవ్వుతోంది గలగలా.

"అయితే అక్కా నేను జమిందారునా?" ఆరేళ్ళ అబ్బాయి అడుగుతున్నాడు కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

"అవున్రా...నువ్వు జమిందారువే" ఆమె అమాంతం వాడిని ఒడిలోకి లాక్కొని వాడి లేత బుగ్గల మీద ముద్దుల ముద్ర లేసింది.

"మరి...మరి...నువ్వు మల్లె మొగ్గవా?" వాడి కళ్ళలో సందేహం.

"ఛ..ఛ..నేను కాదమ్మా. నీ క్కాబోయే పెళ్ళాం మల్లెమొగ్గ."

వాడి బుగ్గలు ఎరుపెక్కాయి. పెళ్ళామంటే వాడికే మర్థమైందో మరి ఒక్క ఉదుటన ఆమె ఒడిలోంచి లేచి "నా పెళ్ళాం మల్లెమొగ్గ...నీ మొగుడు జమిందార్" అంటూ తుర్రుమని తూనీగలా పరుగుతీశాడు.

"వేలెడు లేవు. ఎంత లేసి మాటలు? సాయంకాలం నీకు జున్ను పెడతా నేమో చూడు !"

ఆ సమయాన ఆమె పట్టిన బుంగమూతి లేచినపుడు పరికిణీ కుచ్చెళ్ళ మాటున ఘల్లుమన్న వెండి పాంజేబుల చిరు నవ్వుళ్ళూ - ఆమె ముంజేతులు ముద్దిడుతున్న గాజుల సిరి సందళ్ళూ...ఓహ్..ఎంత అపురూపం !..మరెంత కమనీయం ! ఒక్కసారి .. ఒక్క సారంటే ఒక్కసారి ఆమెతో మాటాడ గలిగితే?

మేడ మీదున్న వాడినల్లా సర్రుమని మెట్లు దిగాను.

"ఏమండీ !" నా పిలుపుతో ఆ వాల్జడ వయ్యారి గిరుక్కున ఇటు తిరిగింది. ఆమె కళ్ళలోని బెదురు 'నేను పల్లెటూరి పడుచును సుమా' అని చెబుతోంది.

"నాకు .. నాకు.. జున్నంటే ఇష్టం. జున్ను పాలు మీరు అమ్ముతారా?" నా మాటలు నాకే వెర్రిగా ఉన్నాయి.

"జున్ను పాలు అమ్మరండీ. మీ కంత కావలిస్తే .. సాయంత్రం పంపిస్తా న్లెండి" ఆమె అటూ ఇటూ కళ్ళతో వెతుకుతూ చెప్పింది.

"థాంక్సండీ. నేను సెలవుల కని మా పిన్ని గారింటికి వచ్చాను. బి.ఏ. ఫైనల్ చేస్తున్నాను."

"తప్పకుండా జున్ను పంపిస్తాను" నేను సంభాషణ పొడిగించటం ఆమె కిష్టం లేనట్టుంది. చప్పున లోపలి గదుల్లోకి వెళ్ళి పోయింది.

నిరాశగా వెనక్కు తిరిగాను.

*** *** ***

"ఆ మల్లెమొగ్గలు చూడు. సంధ్య ముసిరిందంటే చాలు మనసారా విరబూస్తాయి. నువ్వు మాత్రం ఎప్పుడూ ముడుచుకునే ఉంటావ్." నా స్వరంలో నిట్టూర్పు.

"ఎందుకూ పిలిచారు? త్వరగా చెప్పండి" ఆమె స్వరంలో తడబాటు.

"ఎప్పుడూ తొందరే. ఎన్నడైనా నువ్వు స్వేచ్ఛగా మాటాడావా? ఎందు కంత భయం?"

"ఆడ పిల్లలు మగవాళ్ళతో మాటాడకూడదు." ఆమె తలవంచుకుని చెప్పింది.


"అని ఎవరు చెప్పారు?"

ఆమె కాసేపు ఆలోచిస్తున్నట్లు ఉండిపోయింది." ఒకరు చెప్పే దేమిటి? అదంతే."

"అమ్మాయ్ నందా" ఇంట్లోంచి వాళ్ళ నాన్నగారిస్వరం.

పెరిటి గోడకు ఆనుకుని ఉన్నదల్లా చప్పున వెనక్కు జరిగింది నందిని.

"నందినీ! రేపట్నుంచీ కాలేజీలు తెరుస్తారు. ఈ రోజు రాత్రికి వెళ్ళిపోతున్నాను. వెళ్ళగానే ఉత్తరం రాస్తాను."




అదిరి పడి చూసింది నందిని.

"అయ్యబాబోయ్ .. ఆ పని మాత్రం చెయ్యకండి. ఆడ పిల్లకు ఓ అబ్బాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందంటే ఆమెకు ఆయువు మూడినట్టే మా ఇంట్లో" అంది.

"నందా! ఏం చేస్తున్నావ్ ?" దగ్గరగా వినిపించింది కేక.

నందిని త్వరగా త్వరగా లోపలికి వెళ్ళిపోయింది.

"ఓ గాడ్ ! ఫ్రెండ్లీగా ఓ ఉత్తరం రాసుకోవటం కూడా పాపమేనా? ప్చ్! అసలు ఈ మనుషుల మధ్య ఈ ఆడామగా తేడా లేకుండా అందరూ ఒకే జాతయితే ఎంత బాగుండేది !

నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది.

*** *** ***

రెక్కలు విప్పుకుంటూ రెపరెప లాడుకుంటూ మళ్ళీ వచ్చాయి సెలవులు. అమ్మ వద్దన్నా వినకుండా మళ్ళీ పిన్ని గారింటికని వచ్చేశాను. వచ్చాక తెలిసింది నా నేస్తం ఇక ఎదురవదని.

"పిన్నీ ! మరి .. మరి మన పక్కింట్లో నందిని ఏమైంది? కనిపించదేం?" అడగలేక అడిగాను.

పిన్ని ఎందుకో నవ్వి అంది "క్రితం సెలవులకు నువ్వొచ్చి వెళ్ళావా, నువ్వెళ్ళిన నెలకే ఆ పిల్లకు పెళ్ళయి పోయింది. పాలవంచలో కాపురం" అని.

నా గుండెందుకో కలుక్కుమంది. ఆ కలక కలతై కన్నీటి బిందువుగా రాలింది.

"గోరింకా పెళ్ళయి పోతే .. ఏ వంకో వెళ్ళిపోతే .. గుండంతా గుబులై పోదా? గుండెల్లో దిగులై పోదా?" జాలిగా స్పృశిస్తూంది కడవ రేడియో స్టేషన్ నుంచి బాలు స్వరం నన్ను.

తెల్ల వారే ప్రయాణమవుతున్న నన్ను చూసి పిన్ని విస్తుపోయింది.

"ఏమిట్రా మోహన్? వచ్చావో లేదో ఎక్కడికీ ప్రయాణం?"

"పిన్నీ! పాల్వంచలో నా కో ఫ్రెండున్నాడు. ఎప్పటినుంచో రమ్మని గోల. వెళ్ళి అట్నుంచి మా ఊరు చేరతాను."

"నందిని ఉన్న ఊరేనా?" పిన్ని సందేహంగా చూసింది.

"అవును" ఎందుకో నా గొంతు

పట్టినట్లయింది.

"ఎలాగూ వెళుతున్నావ్. వాళ్ళమ్మగా రేమైనా. మాట చెబుతా రేమో కనుక్కొస్తానాగు" పిన్ని నందిని వాళ్ళింటికి కెళ్ళింది.

ఆనందంతో నాకు కూచిపూడి చెయ్యాలనిపించింది.

"ఈ శ్రావణం పోయాక మీ అమ్మా నాన్నా వస్తారు అని చెప్పమన్నార్రా నందినికి. అన్నట్లు ఇదో ఆ పిల్ల అడ్రను" పిన్ని ఓ కాగితం నా చేతుల్లో పెట్టింది.

ఇది పాల్వంచలోని నందిని అడ్రను కాదు. స్వర్గంలోని దేవత అడ్రను.నా గుండెలు గున గున మన్నాయి నాతో.

**** *** ***

తలుపు తడుతుంటే చెయ్యి వణికింది. ఎన్నాళ్ళకు చూడబోతున్నాను నా నేస్తాన్ని!

అవతల చిన్నగా గడియ తీసిన శబ్దం .. గాజుల సవ్వడి !

ఊపిరి బిగబట్టి చూస్తున్నాను. క్షణం అనంతరం "రండి" అన్న పిలుపు.. నా నందిని రూపు.

"నందా!" చప్పున నా పెదవులు కలుసుకున్నాయి.

ఆమె ఫాల భాగాం తూర్పు తీరం. ఆ కుంకుమ ఉదయ సూర్యుడు. ఆ కళ్ళు వినీలాకాశాలు. ఆ కాటుక కదిలే కరిమబ్బు. ఆ పెదవులు ఎర్రని సంధ్యలు. ఆ పలుకులు చల్లని గాలులు.

"ఏమిటలా చూస్తున్నారు?" నందిని కొంగు భుజాల నిండా కప్పుకుంది.

"నా పాత నేస్తంలో కొత్త అందాలు కనిపిస్తుంటేనూ?"

"మీ రిక్కడ కొస్తున్నట్టు మా అమ్మకు తెలుసా?"

"ఈ శ్రావణంపోయాక మీ అమ్మా నాన్నా వస్తారట. కాసిని మంచి నీళ్ళిస్తావా?"

"అయ్యో క్షమించండి..రండి కాళ్ళు కడుక్కుందురుగాని" ఆమె లోనికి దారి తీసింది. బావి దగ్గర కాళ్ళు కడుక్కురాగానే చల్లటి మంచినీళ్ళిచ్చింది.

"నందా! ఈ నీళ్ళు తాగుతుంటే నా కేమనిపిస్తుందో తెలుసా?"

"ఏమని పిస్తుంది?"

"ఈ నీళ్ళలాగే మన స్నేహంకూడా స్వచ్ఛంగా చల్లగా ఉండాలని"

ఆమె మౌనంగా నా వంక చూసింది.

"అన్నట్లు మీ వారెక్కడ?"

"సాయంత్రం గానీ రారు."

సాయంత్రం నేను భోంచేస్తుండగా అతనొచ్చాడు. అతనితో పాటే లోపలి గదిలోకి వెళ్ళింది నందిని. రెండు నిముషాలు అనంతరం అతను వచ్చి నన్ను నవ్వుతూ చూశాడు.

"మా నందినికి అన్నయ్య వరసటగా మీరు? పెళ్ళిలో మిమ్మల్ని చూడనే లేదు. మామయ్యా అత్తయ్యా కులాసేనా?"

నాకు చిత్రంగా ఉంది. నందినికి నేను అన్న వరసని ఎవరు చెప్పారు.? మౌనంగా ఆలోచిస్తున్న. నాకు వంటగది గడపకవతలగా రెండు కళ్ళు బేలగా జాలిగా కనిపించాయి.

"నేను ఆమెకు అన్ననూ కాదు బావనూ కాదు మరొకర్నీ కాదు.నేస్తాన్ని. బంధుత్వాల కన్నా మిన్న అయిన స్నేహబంధం మాది. అన్నో తమ్ముడో అనే వరుసలు కలుపుకుంటేనే మనసు స్వచ్ఛంగా




ఉన్నట్లు లెక్కా? అంతకన్నా స్వచ్ఛమైనదీ స్నేహమని మీకెలా చెప్పాలి! చెలిమి ఒడి ఎంత నిర్మల మైనదో నిష్కల్మషమైనదో మీకెలా తెలుస్తుంది?" నా స్వరం వేయి నాల్కలతో నా గుండెను తూట్లు పొడుస్తోంది. కాని ఒక్కమాట పెదవి దాటి వెలికి రాలేదు.

ఆ తెల్లవారి నేను బయలుదేర బోతూ ఒంటిరిగా కనబడిన నందినిని అడిగాను ఎందుకు నందినీ అలా చెప్పావ్?"

"స్నేహాలూ. అవీ ఆయనకు గిట్టవు. ఆడదానివి నువ్వు. అతనితో నీకేం స్నేహం అంటారు. అందుకే అలా చెప్పాను" ఆమె భయం భయంగా అటూ ఇటూ చూస్తూ చెప్పింది.

మౌనంగా నిట్టూర్చాను.

*** *** ***

అరవై వసంతాలు చూశాను. అరవై శిశిరాలు. దాటాను. వెన్నెల్లు కాశాయి. వర్షాలు కురిశాయి. చలిగాలి వీచింది. వడగాల్పు సోకింది.

ఇప్పుడు నన్నందరూ 'తాతయ్య' అంటారు. ఏమో. నేను తాతయ్య నయ్యానంటే నాకు నమ్మకం లేదు. కానీ..ఒంటరిగా కూర్చొని స్మృతుల గతులలో అనుభూతుల జతులతో జతపడుతుంటే నా కనిపిస్తుంది వయసు మీరింది. కనుకనే జ్ఞాపకాల్ని నెమరు వేస్తున్నానని.

"చూడు .. తాతయ్యా! నందా నాకంతి లాక్కొంటున్నాడు" చందూ అలా ఫిర్యాదు చేస్తుంటే నందన్ చప్పున వచ్చి నా భుజాల మీద ముడుచుకు పడుకుంటాడు.

"తప్పు కదా నందా?" నా పెదవులు మందలి స్తూనే ఉంటాయి. నా మనసు సొరలలో మాత్రం నందిని మెదులుతుంది.

పాల్వంచలో ఆమెను చూశాక మరి ఎన్నడూఆమెను చూడలేదు. వదే వదే కలుసుకుంటే వదిమందిలో మా స్నేహం

పలచబడుతుందేమో అనుకున్నాను. అనుక్షణం అపవిత్రమైన ఆలోచనలు చేసే మనుష్యుల మధ్య పవిత్రమైన స్నేహాన్ని చిన్న బుచ్చ కూడదని నిర్ణయించుకున్నాను. ఆ తరువాత పెళ్ళనీ అదనీ ఇదనీ నా గొడవల్లో పడిపోయి మగతగా నా నేస్తాన్ని మరిచి పోయాను.

కానీ వయసు మీరిన మనసులో .. ఒంటరి తనంలో గతం స్వరజతులై వినిపిస్తోంది. ఇప్పుడు నేను తాతయ్యను అయినట్టే నా నేస్తం నందిని కూడా నాయనమ్మో, అమ్మమ్మో అయి ఉంటుందా?'' మనో నేత్రంలోంచి నందినిని చూడాలని ప్రయత్నిస్తున్నాను.

నందిని ఎప్పటిలా విరికొమ్మే

ఆ నాటిలా సిరిరెమ్మే! అంతేగాని అమ్మమ్మలా .. నాయనమ్మలా ఆ రూపు నా ఊహలకందదు.

''తాతయ్య? ఈరోజు నేనూ చందూ స్కూలు నుంచి వస్తుంటే భలే గమ్మత్తు జరిగింది.'' నందన్ నా ఒడిలో తల పెట్టుకున్నాడు.

''ఏమిట్రా అది?''

''మరేమో నేనూ చందూ వస్తున్నామా! చందూ కాస్త వెనక పడ్డాడు. నా కాకలిగా ఉందేమో.. నేను యమస్పీడుగా వచ్చేస్తున్నా. చందూ 'నందా..నందా' అని నన్ను కేకలు పెడుతున్నాడు. నేను వినిపించినా పలకలేదు. కానీ నా ముందు వెళుతున్న ఓ ముసలమ్మ చందూవచ్చిందాక ఆగి ''ఎందుకు బాబూ పిలిచావ్?'' అంది. ''నేను పిలిచింది మా నందాని'' అన్నాడు చందూ నన్ను చూపించి. ఆవిడ పక్కున నవ్వేసి ''నా పేరుకూడా నందానే. ఏమిటా పెద్ద దాన్ని అలా మర్యాద లేకుండా పేరెట్టి పిలుస్తున్నాడు అనుకున్నాను సుమా'' అంటూ పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్ళి పోయింది. భలే గమ్మత్తుకదూ?'' నందన్ నవ్వుతున్నాడు.

''నంద్హా.. నా నేస్తం కాదు గదా?'' నా పెదవులు అస్పష్టంగా కదిలాయి.

''ఏంటి తాతయ్యా?'' నందన్ అడిగాడు.

''ఒరే నందా? ఆమె ఇల్లెక్కడో చూపుతారా నాకు?'' నా స్వరం ఆత్రతతో కంపించి పోయింది.

''ఓ..యస్.. తాతయ్యా'' నందా తలూపేశాడు.

*** *** ***

''నందా. విధి ఎంత చిత్రమైంది. ఎన్నాళ్ళకు నిన్ను చూశాను.'' నా పెదవుల్లో ఉద్వేగం.

''బాగున్నారా మోహన్?'' నందిని కళ్ళజోడ్తూ తుడిచి మళ్ళీ పెట్టుకుంది.

''మళ్ళీ చూస్తాననుకోలేదు'' నా గుండెల్లో ఆనందం.

''ఎంత మంది పిల్లలు?'' నందిని కాఫీ ఇచ్చింది.

''ముగ్గురు కొడుకులు. పెద్దాడికి పిల్లల్లేరు. చిన్నాళ్ళిద్దరికీ చెరో కొడుకూ. నందా, నా పెద్ద మనుమడికి ఏం పేరు పెట్టానో తెలుసా?''

''ఏం పెట్టారు?''

''అమ్మాయి పుడితే నీ పేరే పెడదామనుకున్నా దురదృష్టం నాకు గానీ.. నా కొడుకులకు గానీ ఆడ సంతానమే లేదు. అందుకే మనుమడికి నందన్ అని పెట్టుకున్నాను. 'నందా' అని పిల్చుకుంటున్నాను.''

ఆమె కళ్ళలోకి చూశాను. మెరుస్తున్న తడి స్పష్టంగా కనిపించింది. ''నాకు ఒక్కడే కొడుకు. అమ్మాయి పుట్టిపురిటిలోనే పోయింది. ఆఏడే ఆయన పోయారు. వీడికి పెళ్ళి చేశాను. ముగ్గురుకొడుకులు. చివరగా ఓ ఆడపిల్ల.''

''ఏరీ..నీ మనుమళ్ళు? ఒక్కళ్ళూ కనిపించరేం?''

''స్కూల్ కెళ్ళారు. పిల్ల చంటిది.నిద్ర పోతోంది''

''మీ కోడలు కనిపించదేం?''

''నా తరుపున ఎవరొచ్చినా మా కోడలు మాటాడదు'' నందని కళ్ళలో నీళ్ళు.

''మా ఇంటి కెప్పుడొస్తావ్ నందా?''

నందిని నన్నగా నవ్వింది అదే సమాధాన మన్నట్లు.

''కొడుకెప్పుడొస్తాడు?''

''వచ్చే వేళయింది''నందిని మాట సగంలోనే అతనొచ్చేడు.

నందిని వంక చూస్తూ అడిగాడు ''ఎవరమ్మా?''

''నా పుట్టి నూరూ అయిన పిన్నిగారి ఊరు ఇక్కడే. ఇరుగు పొరుగు వారం. పలకరించి పోదామని వచ్చాడురా''

అతనొక్క క్షణం నా వంక ఎగాదిగా చూసి వెళ్ళి పోయాడు.

'అంతేనా మా బంధం! ఈ సృష్టిలో తీయనైన స్నేహ బంధం ఇదని ఎందుకు చెప్పదు నందిని? దైవానికి మరో రూపైన చెలిమి మాదని ఎందుకు తెలియజేయదు ఈ నందిని?' నా హృదయం మౌనంగా ఘోషించింది.

నందిని వంక చూశాను. ముఖాన ముడతలు లోతుకు పోయిన-కళ్ళు. వడలిన శరీరం-నెరసిన జుట్టు.

''మన స్నేహానికి ఎంత వయసొచ్చింది!'' దిగ్భ్రాంతిగా అన్నాను.

''అమ్మా! పాప ఏడుస్తోంది. సుశీల నిద్ర పోతోంది కదా పాలు పట్ట కూడదూ' నందిని కొడుకు చిరాగ్గా కేకేశాడు.

నందిని లేచి వెళ్ళి పాపను పాల సీసాను వెంట బెట్టుకొచ్చింది. పాప బుగ్గలు పుణికాను. పాలసీసానోటికి అందించాను!.

''ఓ రోజు వస్తానెండి నడిచి వెళ్ళ గలరా?'' నందిని నన్నికబయలు దేర మని పరోక్షంగా అంటోందా?

''నందినీ! ఇంకా కాసేపు ఏమైనా మాటాడుదూ? నలభై సంవత్సరాల అనంతరం మనకు కబుర్లే కరువైనాయి'' నిష్ఠురంగా అన్నాను.

''మరికాసేపు కబుర్లు చెప్పాననుకోండి. కొడుకూ,కోడలూ మీరు వెళ్ళగానే గయ్యిమంటారు. ఏం చాడీలు చెబుతావు వచ్చినవాళ్ళతో..అలా గంటలుగంటలు హస్కువేస్తావ్ అంటారు.''

నందినీ నవ్వింది.

నా మనసులో చేదుగా నా గుండెలో బాధగా..!

''నందా! నువ్వు పదహారేళ్ళ పరువంలో ఉండగా 'అమ్మో! నాన్న చూస్తే ముక్కలు విరుగుతాయి నీతో మాటాడను' అన్నావు. పెళ్ళయ్యాక 'ఆయన ఏమైనా అనుకుంటారు నీతో మాటాడను' అన్నావు. ఇప్పుడు .. ఈ వృద్ధాప్యంలో 'కొడుకు అరుస్తాడు..నీతో మాటాడను' అంటున్నావు. మరి మరి నువ్వు నాతో మనసారా .. స్వేచ్ఛగా ఎప్పుడు మాటాడతావ్?''

నందినెందుకో నా వంక తదేకంగా చూసింది. చూసి చూసి నవ్వింది. అమాయకమైన ప్రశ్న వేసిన తనయుడిని తల్లి చూసి నవ్వినట్టూ నవ్వింది.

''మోహన్! పదారేళ్ళ వయసులో నేను ఓ తండ్రికి బిడ్డను. తరువాత ఒక భర్తకుభార్యను. ఇప్పుడు ఓ కొడుక్కు తల్లిని. అప్పుడూ..ఇప్పుడూ ఎప్పుడూ నే నో బంధానికి బందీనే. స్వేచ్ఛ విహంగాన్నయ్యి స్నేహ బంధాన్ని వెతుక్కుంటూ రావడానికి మీ మగవాళ్ళకు సాధ్యమైనంతగా ఆడదానిగా నాకు సాధ్యం కాదేమో? ఎంత వయసు వచ్చినా నేను ఆడ పిల్లనే. ఓ పురుమడితో స్నేహం చెయ్యాలంటే నేనూ పురుమణ్ణయి పుట్టాలి. అలాంటిది ఈ సమాజం. అందుకే .. అందుకే మోహన్, నేను పై జన్మలో నీకు స్నేహితుణ్ణయి పుడతాను'' నందిని వెక్కి వెక్కి పడుతోంది.

ఎటో చూస్తున్న నాకు ఆకుల మాటు నుండీ పొంచి..తొంగిచీ నక్కి..నక్కి చూస్తున్న ఓ మల్లెమొగ్గ కనిపించింది.

''నందా? ఆ మల్లె మొగ్గ చూడు. అందం .. మకరందం తన సొత్తయినా పెదవి విప్పి పలుకదు. మౌనంగా పరిమళాలు కురుస్తుందే గాని మనసు తెరిచి మాటాడదు. ఆడపిల్లకూ..మల్లెమొగ్గకూ తేడా ఏముంది? సుగంధాన్ని గుండెల్లోనే దాచు కుంటుంది మల్లెమొగ్గ. ఆశలూ, కోరికలూ, కొంగులోనే ముడుచు కుంటుంది ఆడపిల్ల'' నేను లేచాను నిట్టూర్చుతూ.

నందిని తల వంచుకునే మనుమరాలికి పాలు పడుతోంది.

పాప వంకే చూస్తూ అడిగాను ''పిల్ల పేరేమిటన్నావ్?'' అని

''మల్లెమొగ్గ''

నందిని చప్పున నా వంక చూసింది. చిత్రంగా నవ్వింది. నవ్వుతో పాటు ఓ కన్నీటి బొట్టురాలి పాప చెక్కిలి మీద పడింది. ■

